
**కథ**

# ఆదర్శం

**డి.వి.డి.ప్రసాద్**

**రామారావు మా ఆఫీసుకు వచ్చి మా అందరికీ తన కుమార్తె పెళ్లి శుభలేఖ అందజేసి అందర్నీ పేరుపేరునా రమ్మని పిలిచి వెళ్లిన తరువాత మా ఆఫీసులో ఆ విషయమై పెద్ద చర్చ జరిగింది. నాకైతే మరీమరీ చెప్పాడు శ్రీమతిని కూడా తీసుకురమ్మని. వీలు చూసుకొని ఇంటికి వచ్చి పిలుస్తానన్నాడు. నేనంటే అతనికి చాలా అభిమానం.**



''రామారావు పెళ్లి ఏం పెట్టి చేస్తాడంటావు? రిటైర్మెంట్ డబ్బులు ఏ మూలకీ చాలవు. పెళ్లి ఖర్చులకి కూడా సరిపోవు. సరైన కట్నం ఇవ్వకుండా కూతురికి ఏం సంబంధం తెచ్చి ఉంటాడు?

ఏ ప్రైవేట్ ఉద్యోగో, లేక ఏ ప్యూనో - గంతకు తగ్గ బొంత తెచ్చి ఉంటాడు!'' అన్నాడు సోమనాథం.

అతనికి రామారావు అంటే కసి, పై రాబడి మీద మక్కువ గల అతని ఆటలు రామారావు రిటైరైనంత వరకు సాగలేదు. ఆఖరి మూడేళ్లు అతని క్రింద పనిచేసిన సోమనాథం తన కసి ఆ విధంగా వెళ్లగక్కాడు.

''అంతే అయ్యుంటుంది! రిటైరైన ముందు చెవినిల్లు కట్టుకొని మరీ చెప్పా! ఉద్యోగంలో ఉండగానే నాలుగు డబ్బులు సంపాదించాలని, అలాగైతే రిటైరైన తరువాత కాలుమీద కాలు వేసుకొని గడపొచ్చు! కూతురికి మంచి సంబంధం తేవొచ్చు! మంచి ఇల్లు ఒకటి కట్టుకోవచ్చు! కొడుక్కి లంచం ఇచ్చి మంచి ఉద్యోగంలో వేయించవచ్చు! ఏమీ ఖర్చు పెట్టకుండా కొడుక్కి ఉద్యోగం సంపాదించగలడా! కూతురికి మంచి సంబంధం తేగలడా! వెర్రివాడు! ఏం చేస్తాం. ఏం చెప్పినా, ఎవరు చెప్పినా వినే రకం కాదు! ఏం చేస్తాం, ఎవరి ఖర్మ వారిది!'' అన్నాడు గోపాలరావు.

అతని రిటైర్మెంట్‌కింకా మూడేళ్లుంది. రామారావొక్కడూ వాళ్ల రూట్‌లోకి రాలేదనేది అతని ఆక్రోశం.

''అయినా అందరం వెళ్లాలిరా పెళ్లికి. చూడాలి ఎంత ఘనంగా చేస్తాడో!'' వెటకారంగా అన్నాడు సోమేశం.

''మనందరమూ వెళ్తే భోజనాలు పెట్టగలడంటావా? లేక ఇంటికి తిరిగి వచ్చి భోజనాలు చెయ్యాలేమేమో!'' వెకిలిగా నవ్వుతూ అన్నాడు శేఖరం.

దానిని జోక్‌గా తీసుకొని మిగతా వాళ్లందరూ పగలబడి నవ్వారు.

వాళ్ల మాటలు వింటూంటే నాకు కంపరమెత్తింది. వాళ్లవైపు అసహ్యంగా చూశాను.

నిజాయితీకి, సిన్సియారిటీకి మారు పేరైన రామారావు గురించి వాళ్లు చేసే వ్యాఖ్యానాలు వింటూంటే నాకు చిర్రెత్తుకొచ్చింది.

నన్ను చూసి-

''గురువుగార్ని అన్నామని శిష్యుడికి కోపం వచ్చినట్లుంది!'' అంటూ ఒకరు కామెంట్ చేస్తే మిగతావాళ్లు నవ్వడం, వాళ్లని మరి భరించలేక కాంటిన్ వైపు నడిచాను.

ఇక్కడ రామారావుగారి గురించి చెప్పుకోవాలి. అతను మా ఆఫీసులో పనిచేసి రిటైరైన సీనియర్ హెడ్ అసిస్టెంట్. ఆఫీసులో చాలా సిన్సియర్‌గా నిజాయితీగా పనిచేసి అందరి మన్ననలు పొందేవాడు. అయితే తోటి ఉద్యోగులైన వారెవరికీ అతనంటే పడేది కాదు. ఎందుకంటే తను తినడు కదా, ఎవర్నీ కూడా తిననివ్వడు. అతని ఉనికి వల్ల తమకి నష్టం వాటిల్లుతోందని వాపోయేవాళ్లు. కొత్త ఆఫీసర్లు వచ్చినప్పుడుగాని, హెడ్డాఫీసు నుంచి ఇన్‌స్పెక్షన్‌కి వచ్చిన వాళ్లకిగానీ లేనిపోనివి కల్పించి చెప్పి చివాట్లు పెట్టించి ఆనందించేవారు. నిజాయితీపరులైన ఆఫీసర్లయితే మాత్రం వాస్తవం ఆలస్యంగానైనా గ్రహించి అతన్ని ఆదరించేవారు. అదే, అవినీతిపరులైన అధికారులైతే మాత్రం అతని బాధలు, కష్టాలు వర్ణనాతీతంగా పెరిగిపోయేవి. అయినా దేనికీ చలించకుండా తన దారిన తను నడిచేవాడు.

నేనంటే చాలా అభిమానం రామారావుగారికి. నేను జాయిన్ అయిన కొత్తలో అతని వద్దే పని

నేర్చుకున్నాను. ఆ సమయంలో అతను నన్ను సొంత కొడుకులాగా ఆదరించేవాడు. అన్ని విధాల అతనే నాకు గురువు. అందుకే నేనంటే కూడా మా స్టాఫ్‌కి ఎవరికీ పడదు. అయినా రామారావుగారే నాకెప్పుడూ ఆదర్శం.

కాఫీ తాగుతూ ఆలోచనల్లో పడ్డాను.

రామారావెప్పుడూ అందరికీ వీలైన సహకారం అందించేవాడే కానీ, ఎవర్నీ ఎప్పుడూ వేధించేవాడు కాదు. ఎవరి నుండీ ఎప్పుడూ ఏమీ ఆశించే తత్వం కాదు అతనిది. ఆఫీసు పని మీద వచ్చేవాళ్లైనా, స్నేహితులు, బంధువులు ఇలా ప్రతి వారికీ ఏమాత్రం ఆలోచించకుండా ప్రతిఫలం ఆశించకుండా తనకి వీలైన రీతిలో సహాయం చేసేవాడు. చాలామందికి అతనంటే చాలా గౌరవం. అయితే అతన్నుంచి సహకారం పొందిన స్టాఫ్ మాత్రం అతన్నిప్పుడు నానా రకాలుగా అంటున్నారు. ఎందుకంటే అతని నీతి నిజాయితీ మాత్రం వాళ్లకు నచ్చేది కాదు. అయితే ఒక విషయం నా మనసులో తొలిచేస్తున్నది. వీళ్లన్నట్లు, అక్కడ తన కుమార్తె పెళ్లికి అతను ఏమి ఇక్కట్లు పడుతున్నాడో? ఓసారి వెళ్లి చూసి వస్తే? నేనేమైనా సహాయం చేస్తే ఆయన కాదనకపోవచ్చు. ఇంకో నాలుగు రోజుల్లో పెళ్లి ఉంది. ఎలాగైనా వెళ్లాలి అనుకున్నాకగానీ మనసు స్థిమితపడలేదు.

అనుకున్నట్లుగానే సాయంకాలం శ్రీమతిని తీసుకొని రామారావుగారి ఇంటివైపు బయలుదేరాను.

రిటైరైన తర్వాత రామారావుగారు ఓ చిన్న డాబా ఇల్లు ఊరి చివర కట్టుకున్నారు. ఇంటి ముందు కొబ్బరిచెట్లు, పరిసరాలు చూడటానికి చాలా ఆహ్లాదంగా ఉన్నాయి.

నన్ను చూస్తూనే అతను లోపల్నుంచి వచ్చాడు. ఆప్యాయంగా పలకరించాడు. శ్రీమతి ఇంటి లోపలికి వెళ్లింది. మేము ఇద్దరం వరండాలో కూర్చున్నాం.

ఇల్లంతా పెళ్లి సందడి కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గోడలకి సున్నాలు, ద్వారాలకి పెయింట్లు వేస్తున్నారు.

ఇంట్లో అప్పటికే కొంతమంది బంధువులు ఉన్నారు. అందరూ తలో రకం పనుల్లో ఉన్నారు. పెళ్లి పనులు చురుగ్గా, చకచకా సాగిపోతున్నాయి.

రామారావుగారి అబ్బాయి వచ్చి నన్ను పలకరించి స్వీట్స్, కాఫీ అందించాడు.

''రాజేష్! నువ్వు ఇలా పెళ్లికి ముందు రావడం చాలా సంతోషం! రిటైరైన తర్వాత పి.ఎఫ్., గ్రాట్యుటీ డబ్బుల్లో సగం పెట్టి ఈ ఇల్లు కట్టిన తర్వాత అమ్మాయి పెళ్లి ఎలా జరుగుతుందా అని బెంగ పెట్టుకున్నాను. అయితే మంచి సంబంధం అమ్మాయిని వెతుక్కుంటూ వచ్చింది. నా చిన్ననాటి స్నేహితుడి కొడుకు విశాల్ అమ్మాయిని ఓ పెళ్లిలో చూసి ఇష్టపడ్డాడు. అబ్బాయి ఇంజినీర్. కానీ కట్నం ఆశించలేదు. నా వద్ద మిగిలిన డబ్బులు పెళ్లి ఖర్చులకి సరిపోతాయి. పైగా నాకు తెలిసిన వాళ్లు, స్నేహితులు, బంధువులు వద్దువద్దన్నా రకరకాల సహాయం చేస్తున్నారు. ఎల్లప్పుడూ మీరే మాకు సహాయం చేసే వారుకానీ, ఈ ఒక్కసారికి మాకు అవకాశం ఇవ్వండి అని! మాట సహాయానికి, పని సహాయానికి చాలామంది ఉన్నారు. ఇంత సులభంగా పెళ్లి పనులు తెమిలిపోవడం నాకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు.

అవును మరి! రామారావుగారి పరోపకారం, ఆయనకు కావల్సిన సమయంలో అక్కరకు వచ్చింది. క్లిష్ట పరిస్థితుల్లో ఆయన మంతనమే ఆయన్ను రక్షించింది.

''అన్నట్లు మరో సంతోషకరమైన విషయం. మా వాడు విశ్వానికి బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఆర్డర్ వచ్చింది ఇవాళే! వారంలోగా వెళ్లి జాయినవ్వాలి'' అన్నారతను సంతోషంగా.

నాకు ఈ వార్త మరింత ఆనందాన్నిచ్చింది. అవును మరి! మంచివారికి దేవుడు ఎప్పుడూ అండగానే ఉంటాడు అనుకున్నాను మనసులోనే.

''మాస్టర్‌గారూ! మీ మంచితనమే మీకు అన్ని విధాలా సహకరించింది. మీ నిజాయితీయే మీకు శ్రీరామరక్ష. మీ నుంచి మిగతా వాళ్లందరూ ఎప్పుడు పాఠం నేర్చుకుంటారో?'' అన్నాను.

''నాదేముంది! అంతా ఆ దేవుడి దయ!'' అన్నారు.

నేను లోపలికి వెళ్లి పెళ్లికూతుర్ని పలకరించి అభినందించాను.

శ్రీమతితో కలిసి పెళ్లి పనుల్లో సాయపడసాగాను.

అయితే ఈ పెళ్లి రామారావుగారు ఎలా చేస్తారో చూద్దాం అని ఉవ్విళ్లూరే మా ఆఫీసులో ఉన్న దుష్టబృందం ఇక్కడ వైభవంగా జరగబోయే పెళ్లిని, రామారావుగారి బంధువుల స్నేహితుల బలగాన్ని చూసి ఎలా స్పందిస్తారో, విశ్వానికి మంచి ఉద్యోగం రావడం విని ఎలా ఫీలవుతారో వాళ్ల ముఖాలెలా మారతాయో మాత్రం చూడాలని ఉంది.

✤

## అంతా మాయ

**ఖయామత్ చిత్రంలో తనతో కలిసి నటిస్తున్న నేహా ధుపియా వైఖరి అజయ్‌ని ఇరుకున పెట్టేస్తోంది. మొన్నామధ్య మీడియా ముందు నేహా మాట్లాడుతూ అజయ్ అంటే తనకెంతో అభిమానం అంటూనే అతన్ని మంచి భర్తగా అభివర్ణించింది. ఇవన్నీ చదివిన అజయ్ ఇదంతా మీడియా కుట్రే అంటున్నాడు. బికినీలో తన అందచందాల్ని ఆరబోసిన నేహాలో మంచి టాలెంట్ ఉందని కితాబునిస్తూనే తన గురించి ఆమె అలా మాట్లాడుతుందని అనుకోవడం లేదంటున్నాడు. వీరిద్దరి మాటల్ని చూస్తుంటే ఇదంతా మాయలా ఉంది.**

